క్లుప్తంగా

ట్రైసైకిల్ వితరణ



దివ్యాంగుడికి ట్రైసైకిల్‌ను అందజేస్తున్న బీద మస్తాన్‌రావు

కావలి: మండలంలోని రుద్రకోటకు చెందిన దివ్యాంగుడు చలంచర్ల ప్రహల్లాద్‌కు సంయుక్త సేవా సంస్థ సమకూర్చిన ట్రైసైకిల్‌ను రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అందజేశారు. మస్తాన్‌రావు మాట్లాడుతూ తమ బీఎంఆర్ ట్రస్ట్ ద్వారా త్వరలోనే బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లను అందజేయనున్నట్లు తెలియజేశారు. సంయుక్త సేవా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు బెజవాడ రవి, రామస్వామి, సంస్థ అధ్యక్షుడు సురేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు జి ప్రసన్నాంజనేయులు, కామరాజు, సురేష్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

వీఐపీ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా అల్లూరు వాసి



ఎల్లు సాల్మాన్ రాజు

అల్లూరు: వీఐపీ మానవహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా అల్లూరుకు ఎల్లు సాల్మాన్‌రాజు నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ డైరెక్టర్ కట్టడి ప్యారిస్‌బాబు లేఖ ద్వారా తెలియజేశారు. గతంలో రెండేళ్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. మానవహక్కుల అవగాహన సదస్సులు పెట్టి హక్కుల్ని ప్రజలకు తెలియజేసే విధంగా చైతన్యం తీసుకువస్తానని తెలిపారు.

మహాలక్ష్మమ్మ జాతరకు మొదటి చాటింపు



మొదటి చాటింపు వేస్తున్న నిర్వాహకులు

అల్లూరు: అల్లూరు దళితవాడలోని మహాలక్ష్మమ్మ జాతరకు శుక్రవారం మొదటి చాటింపు నిర్వహించారు. మొదటగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం



పట్టుబడిన మద్యం సీసాలతో ఎస్సై, సిబ్బంది

ఉదయగిరి: మండలంలోని కృష్ణంపల్లిలో నిర్వహిస్తున్న మద్యం బెల్టు దుకాణంపై గురువారం రాత్రి ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి దాడులు నిర్వహించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ ఉన్నతాధికారుల సమాచారం మేరకు మద్యం బెల్టుదుకాణంపై దాడులు నిర్వహించి 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్టు షాపు నిర్వాహకుడు ఊజర్ల రమణారెడ్డిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

14 మద్యం బాటిళ్ల పట్టివేత



మద్యం బాటిళ్లను చూపిస్తున్న ఎస్సై

కొండాపురం: మండలంలోని శెట్టిపాళెంలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై దాడులు నిర్వహించి 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై షేక్ ఖాజావలి శుక్రవారం తెలిపారు. గ్రామస్తులు సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించి నిర్వాహకుడు పకీరప్పపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



కోదండరామస్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

కలిగిరి: స్థానిక కొత్తూరులో నూతనంగా నిర్మిస్తున్న కోదండరామస్వామి ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామస్తులు ఈ భూమి పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

స్వయం ఉపాధి.. జీవనోపాధి

పొదుపు సంఘాలు.. అందులో మహిళలు చాలా ఏళ్లుగా ఉన్నాయి.. ఉన్నారు. అయితే వీరిని గత ప్రభుత్వాలు పాలకుల సభలకు జనాలుగా చూశాయి. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదుపు మహిళలను పారిశ్రామిక, వ్యాపార వేత్తలుగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించారు. పొదుపు సంఘాల రుణాలకు తోడు స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీలు అందించి చిన్న తరహా కుటీర పరిశ్రమల నుంచి.. చిరు వ్యాపారులుగా స్వయం ఉపాధితో జీవనోపాధులు మెరుగు పరుచుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

- కుటీర పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహం
- పొదుపు, స్త్రీనిధి రుణాలకు తోడుగా బ్యాంక్ లింకేజీ రుణాలు
- ఆర్థికంగా ఎదుగుతున్న అక్కచెల్లెమ్మలు
- మహిళలను పట్టించుకోని గత ప్రభుత్వం



ఫ్యాన్సీ స్టోర్, టిఫిన్ అంగడి నిర్వహిస్తున్న మహిళ

చేజర్ల: స్వయం సహాయక గ్రూపు మహిళల జీవనోపాధి కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. పొదుపు, స్త్రీనిధి రుణాలకు తోడుగా బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరు చేయిస్తూ మహిళల ఆర్థిక పురోగతికి తోడ్పాటునందిస్తోంది. స్వయం సహాయక గ్రూపుల్లోని ప్రతి మహిళ తాను ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు డీఆర్‌డీఏ అధికారులు అడుగడుగునా అండగా నిలుస్తున్నారు. పొదుపు మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీకి రుణాలు, స్త్రీ నిధి, ఉన్నతి (ఎస్టీ, ఎస్సీలకు జీవనోపాధుల కోసం) వంటి రుణ పథకాల ద్వారా మహిళల జీవన విధానాన్ని మెరుగు పరుస్తోంది.

గతంలో అరకొర మందికి.. అరకొర రుణాలు

గత ప్రభుత్వంలో మహిళలకు రుణాలిచ్చినా వాటిని వారు తిరిగి కట్టలేక అష్టకష్టాలు పడేవారు. అరకొరగా, విడతల వారీగా రుణాలు ఇవ్వడం, కొందరికే రుణాలు ఇవ్వడం వంటి పరిణామాలతో తీసుకున్న రుణాలను ఇంటి అవసరాలకు వాడుకునే పరిస్థితి. తిరిగి కట్టేందుకు మళ్లీ అప్పులు చేయాల్సి వచ్చేది.

48 గంటల్లోనే రుణం మంజూరు

ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ పరిస్థితి మారింది. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం సహకరిస్తోంది. ఒక గ్రూపులో 10 నుంచి 15 మంది సభ్యులు ఉండగా, గ్రూపునకు రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తున్నారు. ప్రస్తుతం మండలంలో 773 గ్రూపుల్లో 8,225 మంది సభ్యులు ఉన్నారు. 2023–24 సంవత్సరానికి ఇప్పటి వరకు రూ.10.15 కోట్ల మేర రుణాలు ఇచ్చింది. 2022–23లో రూ.12 కోట్ల వరకు రుణాలు ఇచ్చింది. పొదుపు మహిళల ఆర్థిక ప్రగతి కోసం అత్యవసర పరిస్థితుల్లో స్త్రీ నిధి కింద రూ.3 కోట్ల మేర రుణాలు అందించారు. పొదుపునకు సంబంధించి రుణం



పిండిమిల్లు నిర్వహిస్తున్న మహిళ

కోసం దరఖాస్తు చేసిన 48 గంటల్లోనే రుణాన్ని అందిస్తున్నారు. ఇక ఉన్నతి కింద ఎస్టీ, ఎస్సీలకు గతేడాది రూ.55 లక్షల రుణం అందించారు. గొర్రెలు, మేకలు, కుటీర పరిశ్రమల స్థాపనకు రుణ సౌకర్యం కల్పిస్తోంది. కొన్ని పొదుపు గ్రూపులకు వడ్డీ లేని రుణంతో ఆటో కొనేందుకు ఆర్థిక సహాయం అందించింది. ఇలా ప్రతి ఒక్కరికి రుణం రూపంలో ఆర్థిక తోడ్పాటు అందించి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం దోహదపడుతోంది.

ఆర్థికంగా నిలదొక్కుకున్నా



ప్రభుత్వం తరఫున పొదుపు గ్రూపులో బ్యాంక్ ద్వారా రూ1.20 లక్షలు, స్త్రీనిధి ద్వారా రూ.50 వేలు రుణం అందించడంతో నేను టిఫిన్ అంగడి, ఫ్యాన్సీ, ప్రొవిజన్స్ స్టోర్ నిర్వహిస్తున్నారు. నా వ్యాపారాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేసుకొన్నాను. దీనికి తోడు వైఎస్సార్ ఆసరా కింద ఏటా రూ.16,000 వస్తోంది. పిల్లలకు చదువుకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు వస్తున్నాయి. దీంతో నా కుటుంబం ఆర్థికంగా స్థిరపడింది.

– తాళ్ల శ్రీదేవి, టీకేపాడు

టైలరింగ్‌తో జీవిస్తున్నా..



నేను తిరుమల పొదుపు గ్రూపులో సభ్యురాలిగా ఉన్నాను. బ్యాంక్ ద్వారా ప్రభుత్వం అందించిన రుణంలో చేజర్ల బస్టాండ్‌లో టైలరింగ్ షాపు నిర్వహిస్తున్నాను. బ్యాంక్ ద్వారా రుణం రూ.1.50 లక్షలు, ఆసరా ద్వారా రూ.37,500 జమ అయ్యాయి. నాలుగు టైలరింగ్ మెషిన్లు, ఒక జిగ్‌జాగ్ మెషిన్ పెట్టుకున్నాను. అన్ని రకాల డిజైన్లలో డ్రస్ మెటీరియల్ కుట్టుతున్నాను. నా ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం అందించిన సాయాన్ని మరిచిపోలేను.

– షేక్ దిల్‌సాద్, చేజర్ల

రుణాలు అందిస్తున్నాం



పొదుపు గ్రూపు మహిళలకు ఆర్థికంగా ఎదిగేందుకు బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు అందిస్తున్నామన్నారు. స్త్రీ నిధి, ఉన్నతి ద్వారా రుణాలిచ్చి మహిళలు కుటీర పరిశ్రమలు పెట్టుకొనేందుకు, చిన్న తరహా వ్యాపారాలు పెట్టుకునేందుకు సహకరిస్తున్నారు. రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

– చీర్ల సుజన ఏపీఎం, చేజర్ల

కుట్టు శిక్షణ సర్టిఫికెట్ల అందజేత

ఆత్మకూరు: పట్టణానికి చెందిన బ్రహ్మశ్రీ చేజర్ల పుల్లయ్యాచార్యులు విశ్వబ్రాహ్మణ ధర్మసత్రం ఆధ్వర్యంలో గత ఐదు నెలలుగా టైలరింగ్‌లో ఉచిత శిక్షణ పొందిన మహిళలకు నిర్వాహకులు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ నోటి విజయజ్యోతి 15 మందికిపైగా శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. గత పదేళ్లుగా సంస్థ తరఫున పేద మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి స్వయంగా జీవనోపాధి చేసుకునేలా ఉచిత శిక్షణతో పాటు సర్టిఫికెట్లు, కొందరికి టైలరింగ్ మెషిన్లు అందజేస్తున్నట్లు నిర్వాహకులు, సంస్థ అధ్యక్షులు రమణమూర్తి, కోఆర్డినేటర్ నాగరత్నమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవీ చెంచురత్నం, కృష్ణమాచారి, చేజర్ల ఆచారి తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న కౌన్సిలర్ విజయజ్యోతి

జనవరి 2 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

ఆత్మకూరురూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాలు జనవరి 2వ తేదీ నుంచి మండలంలో ప్రారంభమవుతాయని ఎంపీడీఓ బజాక్‌ప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ స్థాయిలో మొదటి దశలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు వైద్య సేవలను అందించిందని, ఇలా ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ కార్యక్రమం నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా జనవరి 2న చెర్లోయడవల్లి, 9న రామస్వామిపల్లి, 19న బోయలచిరివెళ్ల, ఫిబ్రవరి 6న బట్టేపాడు, 13న కరటంపాడు, 20న నువ్వూరుపాడు, 27న వెన్నవాడ, మార్చి 5న మురగళ్ల, 12న వాశిలి, 19న అప్పారావుపాళెం సచివాలయాల పరిధిలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తామన్నారు.

అంగన్‌వాడీ కుటుంబానికి సాయం

సంగం: మండలంలోని తరుణవాయి దాసరిపాళెంలో ఇటీవల మృతి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త ఇండ్ల వనమ్మ కుటుంబానికి సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్త నివాసానికి చేరుకున్న కంచి పరమేశ్వరరెడ్డి ఆమె భర్త, ముగ్గురు పిల్లలను ఓదార్చారు. తన ట్రస్ట్ తరఫున రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, రామిరెడ్డి, అశోక్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ, పలు మండలాల అంగన్‌వాడీలు ఉన్నారు.



ఇండ్ల వనమ్మ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఆత్మకూరు: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల న్యాయమైన కోర్కెలు పరిశీలించి పరిష్కరించాలని కార్మికులు కోరారు. స్థానిక మున్సిపల్ కార్మికులు, రాష్ట్ర మున్సిపల్ కార్మికుల యూనియన్ పిలుపు మేరకు శుక్రవారం నాలుగో రోజు సమ్మె చేశారు. పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయడం, వారికి ప్రభుత్వ పరంగా రావాల్సిన అలవెన్స్‌లు అందజేయడంతో పాటు పారిశుధ్య పరికరాలను అందించాలని కోరారు. కార్మికులకు మద్దతుగా సీపీఎం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

అనుచితంగా మాట్లాడొద్దు

సంగం: ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నారని, అలాంటి ఎమ్మెల్యేపై వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడడం సరికాదని వైఎస్సార్‌సీపీ నేత పిట్టు పట్టాభిరామిరెడ్డి అన్నారు. శుక్రవారం సంగం ఎంపీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పనులతో నియోజకవర్గంలో ప్రజలందరూ ఆయన వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నారని, అలాంటి నాయకుడిపై రైతు సంక్షేమ సంఘం నాయకుడు పిట్టు రేణుకారెడ్డి అసందర్భంగా, అనుచితంగా మాట్లాడడం సరికాదన్నారు. సోమశిల నుంచి ఉత్తర, దక్షిణ కాలువల రైతాంగం కోసం ఎంతో శ్రమిస్తున్నారని, ఐఏబీ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడలేదని విమర్శించడం సరికాదన్నారు. ఆయన రైతాంగం కోసం ఏం మాట్లాడారో జిల్లా ప్రజలందరికీ తెలుసునన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పులగం శంకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మానికల చందన్ కుమార్, ఫణికుమార్‌రెడ్డి, యుజవన విభాగం అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆమ్‌ఆద్మీ పార్టీ కార్యాలయం ప్రారంభం

కలిగిరి: కలిగిరిలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఉదయగిరి నియోజక ఇన్‌చార్జి అరిగెల శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ కార్యాలయం ప్రారంభించారు. ఆప్ జిల్లా అధ్యక్షుడు గుర్రంకొండ సర్దార్ మాట్లాడుతూ పేదల పక్షాన నిలబడి ప్రజలకు తమవంతు సేవలు అందిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు పేదలకు సజావుగా అందేలా చూస్తామన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

కావలి: దగదర్తి మండలం చెన్నూరు సచివాలయం పరిధి కట్టుబడి పాళెం జెడ్పీ హైస్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు శుక్రవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన బడి నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా రూ.వేల కోట్ల వెచ్చించి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పిస్తున్నారన్నారు. కార్పొరేట్‌కు దీటుగా డిజిటల్ బోధనకు చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లను అందజేస్తోందని వివరించారు. విద్యార్థులు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్న ఎంపీపీ ప్రసాద్‌నాయుడు

అక్రమ మద్యం పట్టివేత

- పోలీసుల అదుపులో ఇద్దరు వ్యక్తులు

ఆత్మకూరు: ఆత్మకూరులో వేర్వేరు చోట్ల మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎస్సై ముత్యాలరావు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని నెల్లూరు–ముంబయి రహదారిపై మూసివేసి ఉన్న ఓ డాబాలో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న 6 ఫుల్ మద్యం బాటిళ్లను ఎస్సై కె.ముత్యాలరావు స్వాధీనం చేసుకున్నారు. వీటిని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న గంటా చైతన్యను అదుపులోకి తీసుకున్నారు. మరో వ్యక్తి పరారైనట్లు ఎస్సై తెలిపారు. ఏసీఎస్ఆర్‌కాలనీలో 16 మద్యం బాటిళ్లు (క్వార్టర్) విక్రయిస్తున్న దొడ్ల రవీంద్రను అదుపులోకి తీసుకుని మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.



చేనేతకాలనీ వెనుక వాగు పోరంబోకులో నిర్మిస్తున్న కట్టడాన్ని జేసీబీతో తొలగిస్తున్న అధికారులు



ప్రభుత్వ ఉపాధ్యాయుడు చెరువు పారుదల కాలువను ఆక్రమించి పక్కా నిర్మాణం

అధికారుల పక్షపాతం

- కొందరి ఆక్రమణలే తొలగింపు
- పూర్తి స్థాయిలో స్థలాలు స్వాధీనం చేసుకోని ఇరిగేషన్ అధికారులు
- అధికారుల వైఖరిపై సర్వత్రా విమర్శలు

ఆత్మకూరు: ఇరిగేషన్‌శాఖ అధికారుల వైఖరి.. అయిన వారికి ఆకుల్లో.. కాని వారికి కంచాల్లో అన్న చందంగా ఉంది. పట్టణంలో ఇరిగేషన్ శాఖకు చెందిన స్థలాలను కొందరు అక్రమంగా ఆక్రమించి కట్టడాలు నిర్మిస్తున్నా చోద్యం చేస్తోంది. ఈ విషయంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చొరవ తీసుకుని ప్రతి ఆక్రమణను నిక్కచ్చిగా తొలగించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. అయితే సదరు అధికారులు రంగంలోకి దిగి రెవెన్యూ, పోలీసు అధికారుల సహకారంతో శుక్రవారం కొందరికి చెందిన ఆక్రమణలే తొలగించారు. అయితే ఆక్రమణల తొలగింపులో ఇరిగేషన్ శాఖ అధికారులు పక్షపాత వైఖరిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలో ప్రభుత్వ జాగా కనిపిస్తే పాగా వేసి రోజుల వ్యవధిలోనే పక్కా కట్టడాలు చేస్తున్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలతో పాటు సాగునీటి కాలువలు పక్కనే ఉన్న పోరంబోకు స్థలాల్లో సైతం ఈ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. గత కొద్ది రోజులుగా ఈ వ్యవహారం సాగుతున్నా సంబంధిత అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదు. మెయిన్ బజారులో బీఎస్సార్ సెంటర్ నుంచి సోమశిల రోడ్డు సెంటర్ వరకు ఇరువైపులా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన వ్యాపార గదుల రేకులు తొలగించి పక్కా స్లాబులు పోస్తూ సొంత స్థలాల్లాగా మొదటి అంతస్తులు నిర్మిస్తున్నారు. ఈ విషయాలు తెలుసుకున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను పరిశీలించి చర్యలు చేపట్టాలని గత వారం ఆదేశించారు. దీంతో మూడు రోజుల క్రితం మున్సిపల్ అధికారులు కొంత మేర తొలగింపు చేసి ప్రభుత్వ భూమి అని బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే ఇరిగేషన్ అధికారులు ఆక్రమణలపై పట్టించుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు నెలకొన్నాయి. ఎట్టకేలకు ఈ రోజు తొలగింపు చర్యలు చేపట్టినా మొక్కుబడిగా చేస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈను సంప్రదించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖాళీ స్థలాలను ఆక్రమణల చెర నుంచి స్వాధీనం చేసుకుంటున్నామన్నారు. ముఖ్యమైన కాలువలపై నిర్మాణాల విషయాన్ని ప్రశ్నిస్తే త్వరలో చర్యలు తీసుకుంటామని దాటవేశారు.

పట్టణంలో ఆక్రమణల పర్వమిది..

- పట్టణ నడిబొడ్డున, సోమశిల మార్గంలో చెరువు వద్ద, జలవనరుల శాఖకు చెందిన స్థలాలను ఆక్రమించి పక్కా భవనాలు నిర్మిస్తుంటే వాటి జోలికి వెళ్లడంలేదు. కేవలం కొందరు పేదలు వేసుకున్న బేస్‌మెంట్లను జేసీబీ యంత్రంతో తొలగించి మమ అనిపించారు.
- పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సోమశిల రోడ్డు సెంటర్‌లో తొలుత చిన్నపాటి బంకును ఏర్పాటు చేసి దాని వెనుకనే ఇరిగేషన్ కాలువను ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో వాటిపై ఇరిగేషన్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- చెరువు వద్ద అలుగు పోరంబోకు ఖాళీ స్థలాన్ని మరో వ్యాపారి ఆక్రమించి పక్కా నిర్మాణ పనులు చేసి శ్లాబ్ పోస్తున్నాడు.
- చేపల మార్కెట్ ఎదురు వైపు, ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ ప్రహరీ గోడను ఆనుకొని ఓ వ్యక్తి రెండు వ్యాపార గదులను పక్కాగా నిర్మించాడు.
- సోమశిల రోడ్డు సెంటర్ నుంచి బీఎస్సార్ సెంటర్ వరకు మున్సిపల్ అద్దె గదుల్లో వ్యాపారాలు చేసుకుంటున్న పలువురు రేకులు తొలగించి పిల్లర్లు వేసి పక్కా శ్లాబ్‌తో నిర్మాణాలు చేపట్టారు.
- ఆత్మకూరు–నెల్లూరుపాళెం రహదారిపై ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఆనుకుని అత్యంత విలువైన సుమారు 30 అంకణాలపైగా స్థలాన్ని ఆక్రమించి కొందరు నిర్మాణాలు చేపట్టారు. ఈ స్థలంలో ఓ వైపు ప్రభుత్వ స్థలమని బోర్డు పెట్టి ఉన్నా మరో వైపు నిర్మాణాలు జరుపుతుండడం ఆశ్చర్యకరం.
- సోమశిల రోడ్డు సెంటర్ వద్ద చెరువు పారుదల కాలువ ఇరిగేషన్ శాఖ ఆధీనంలో ఉన్న స్థలం మైనార్టీలు కొందరు తమ సంస్థకు చెందుతుందంటూ ఇటీవల చదును చేయడం గమనార్హం.



చెరువు అలుగు కాలువ పక్కనే పక్కా నిర్మాణం చేపట్టి శ్లాబ్ పోస్తున్న దృశ్యం



ప్రభుత్వ ఎస్సీ హాస్టల్ ప్రహరీ గోడను ఆనుకొని నిర్మించిన గదులు

కుష్టు నివారణపై ప్రత్యేక దృష్టి

కలిగిరి: కుష్టు వ్యాధి నివారణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని జిల్లా టీబీ, కుష్టు నియంత్రణాధికారి షేక్ ఖాదర్‌వలి తెలిపారు. కలిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం కలిగిరి మసీదు సెంటర్‌లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఆయన వెంట వైద్యాధికారిణి గీతారెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

వరికుంటపాడు: మండలంలో జరుగుతున్న కుష్టు వ్యాధి సర్వేను శుక్రవారం సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, పీహెచ్ఎన్ సుశీలమ్మ పరిశీలించారు. వరికుంటపాడు సచివాలయ పరిధిలో జరుగుతున్న సర్వేను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలందించారు. వారు మాట్లాడుతూ సర్వే బృందం ఇంటింటికీ తిరిగి రోజుకు ముప్పైమందిని పరీక్షించాలన్నారు. శరీరంపై స్పర్శలేని మచ్చలుంటే వారిని గుర్తించి నమోదు చేయాలన్నారు.

ముమ్మరంగా కుష్టువ్యాధిపై సర్వే

అనుమసముద్రంపేట: మండలంలో కుష్టువ్యాధిపై ముమ్మరంగా సర్వే నిర్వహించారు. డాక్టర్ జ్యోతిరాణి ప్రజల వద్దకు వెళ్లి కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. రాగి రంగులో మచ్చలు ఉండి స్పర్శ లేకపోతే దానిని కుష్టువ్యాధిగా గుర్తించవచ్చునని తెలిపారు. చర్మంపై పుండ్లు, అరచేతులకు స్పర్శ లేకపోవడం కుష్టువ్యాధి లక్షణాలని ఆమె తెలిపారు.

కుష్టు వ్యాధిపై సర్వే

చేజర్ల: మండలంలోని పాడేరు, పాతపాడు గ్రామాల్లో శుక్రవారం వైద్య సిబ్బంది కుష్టు వ్యాధిపై సర్వే నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి కుష్టు వ్యాధికి సంబంధించిన మచ్చలు ఉన్నాయా అని పరిశీలించారు. అనంతరం సచివాలయంలో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో డాక్టర్ మెహతాబ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మాతృవందనా యోజనా పథకం కింద తొలి గర్భం దాల్చిన మహిళలకు రూ.2 వేలు, 5 నెలల తర్వాత వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి వెయ్యి రూపాయలు, డెలివరీ అయ్యే ముందు రూ. 2 వేలు వంతున అందజేస్తారనాన్నారు. ప్రభుత్వాస్పత్రిలో డెలివరీ చేయించుకుంటే మరో వెయ్యి రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కారక్రమంలో సీహెచ్‌ఓ చంద్రయ్య, ఏఎన్ఎంలు రేవతి, రత్నకుమారి, మహాలక్ష్మి, భాను, మమత తదితరులు పాల్గొన్నారు.



కలిగిరి: కుష్టు సర్వేను పరిశీలిస్తున్న జిల్లా టీబీ నియంత్రణాధికారి ఖాదర్‌వలి

అయోధ్య రాముడు అక్షతలకు ఘనస్వాగతం



కరటంపాడుకు అక్షతలతో చేరుకున్న అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్ బృందం

ఆత్మకూరురూరల్: అయోధ్యలో జనవరి 22న శ్రీరాముడి ప్రతిష్ఠ కార్యక్రమం భాగంగా స్వామివారి అక్షతలను దేశ వ్యాప్తంగా ప్రతి గ్రామంలోని దేవాలయాలకు అందజేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం మండలంలోని కరటంపాడుకు అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో వచ్చిన అయోధ్య అక్షతలకు శ్రీరామ భక్తులు స్వాగతం పలికారు. ఆంజనేయస్వామి విగ్రహం నుంచి సీతారామ దేవాలయం వరకు జై శ్రీరామ్ నామస్మరణతో ఊరేగింపుగా తీసుకువచ్చిన అక్షతలను జనవరి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు శ్రీరామ భక్తులు ఇంటింటికి తిరిగి అందజేయాలని ట్రస్ట్ బృందం పేర్కొంది.

ఫిజికల్ సైన్స్ కాంప్లెక్స్



ప్రయోగాలను పరిశీలిస్తున్న అధికారులు

సోమశిల: అనంతసాగరం మండలం రేవూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఫిజికల్ సైన్స్ కాంప్లెక్స్ కార్యక్రమాలను ఎంఈఓ బాలకృష్ణారెడ్డి సందర్శించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జి ఉపాధ్యాయుల నేతృత్వంలో 8వ తరగతి విద్యార్థులు కౌశిక్, సుజయ్, హర్షిత, కావ్య ఫ్లయింగ్ రోబోట్ రిమోట్ కంట్రోల్, వీల్ చైర్ మొదలైనవి తయారు చేసి ప్రదర్శించారు. సైన్సు ఉపాధ్యాయుడు గురుప్రసాద్‌ను ఎంఈఓ బాలకృష్ణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ శ్రీలత, గురుప్రసాద్, రమేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.